మీద మరోమూల పడుకున్న ముష్టిరాములుగాడి పక్కలో దూరి వెచ్చగా పడుకున్న కుక్కపిల్లని చూసేసరికి సింహాద్రిగాడికి తిక్కరేగింది–

సింహాద్రి రోగం ముదిరి కదలలేని స్థితికి వచ్చిందగ్గిర నించి కకుక్కపిల్లకి తిండి కరవయి తోటి ముష్టివాడు రాములుగాడి చుట్టూ తోకాడించుకుంటూ తిరిగి వాడు జాలిపడి పడేసే మెతుకులు తినడం మొదలుపెట్టింది కుక్కపిల్ల. సింహాద్రి మరి లాభంలేదని కుక్కపిల్లకి అర్థం అయిపోయింది. సింహాద్రి పిలిస్తే దగ్గిరకి రావడం మానేసింది. రాములుగాడి దగ్గిరచేరి పడుకోడం మొదలుపెట్టింది. "దొంగనంజా యింతప్పటినించి సాకాను, యిస్వాసం లేదేనీకు, నీయమ్మ.... రామె...." బండ బూతులు తిడ్తూ సింహాద్రి తూలుకుంటూ లేచి కుక్కపిల్ల చెవులుపట్టుకు లాక్కొచ్చి అది కదలకుండా కావలించుకుని పడుకున్నాడు. కుక్కపిల్ల గింజుకుంటూ లేచి దూరంగా పోయి మిడుకు మిడుకు చూస్తూ గుర్రు గుర్రుమంది- "రంకు నంజా నాలుగురోజులు తిండెట్టకపోతే మరీడ్ని మరిగేవ్ గుడిసేటి నంజా-" సింహాద్రి కోపం పట్టలేక ఓ రాయితీసి విసిరాడు- కుక్కపిల్ల చెంగున గెంతి తప్పించుకుని "ఎంత కుక్కనైతే మాత్రం తిండెట్టకపోతే యిస్వాసం ఏమిటన్నట్టు" సింహాద్రిని నిరసనగా చూసి, నిర్లక్ష్యంగా రాములుగాడి పక్కలో దూరి పడుకుంది మళ్ళీ—

★

# అగ్గిపుల్ల

"అప్పా, అగ్గి రాజెట్టినావా- కొత్త అగ్గెట్టు" పిడక పట్టుకుని గుడిసెలోకి వచ్చింది రత్తాలు. అప్పాలేదు, అగ్గీలేదు- కాని, అగ్గిలాంటి సింహాద్రి- ఫాక్టరీ నుంచి వస్తూ సుక్కేసుకు వచ్చి నగం మత్తులో నులక మంచానికి అడ్డం పడి వున్నాడు.

సింహాద్రిని చూస్తే నిప్పుని చూసినట్టే రత్తాలుకి భయం- ఆడి సూపుసోకితే కాలి భస్మం అవుతుందని భయం- దగ్గిరకెడితే కాలుతుందని భయం- నిప్పుకి దూరంగా వుండాలనుకుంటుంది- సింహాద్రి అంటే సింహస్వప్నం రత్తికి. సుక్కలాంటి రత్తి ఎంత ప్రయత్నించినా తనకు దక్కకుండా పోతూందని సింహాద్రికి ఉడుకు-తాగుబోతు సచ్చినోడు, ముండల సూతాకోరు సింహాద్రిని చూస్తే వంటికి

నిప్పంటుకున్నట్టు మంట రత్తికి-నలుపు అయితేనేం, చారడేసి కళ్ళతో, కసుముక్కు-తీరుతో, నొక్కుల జుత్తుతో నిండుగా పుష్టిగా నీటుగా వుండే సుక్కలాంటి రత్తిని పొందని జన్మ ఏం జన్మ అన్పిస్తుంది సింహాద్రికి- మనసు పెంచుకుని మనువాడా లన్న కోరిక ఎంత ప్రయత్నించినా తీరక మనసు పడిన మగువ మరొకడి మగువ అయిందన్న దుగ్ధ సింహాద్రిని నిలవనీయలేదు- కాపేసి, కొంగట్టుకు కౌగిలిలోకి లాక్కుంటే. చెంప దెబ్బ తిన్న అవమానం- మానని పుండులా యింకా సలుపుతూనే వుంది సింహాద్రిని- మనసున్న మనిషికి మనసు ఇచ్చి సల్లగా కాపురం చేసుకుం టుంటే కళ్ళల్లో నిప్పులు పోసుకుని కాపురానికి నిప్పెట్టాలని సింహాద్రి చేసే ప్రయ త్నాలు, వేసే వెకిలివేషాలు చూస్తూంటే రత్తి గుండెల్లో నిప్పు రాజుకుంటుంది- నిప్పు వెంట పొగలాగ ఎక్కడికెడితే అక్కడ తనవెంట తయారవుతూ ఆమె గుండెల్లో కుంపటిలా తయారయ్యాడు సింహాద్రి– నిప్పులాంటి సింహాద్రికి 'చల్లని నీటికుండ లాంటి సంద్రి పెళ్ళం- ఏదో మాయదారి దేముడు- అప్ప మొహం చూసి వగ్గుతున్నా నేకపోతే నీకెప్పుడో నిప్పెట్టే దాన్నిరా-' యీ పాటికి అనుకుంటుంది కసిగా రత్తి-

"అప్పా– యేటి సందేళ తొంగున్నావా వల్లు సరి నేదా-" ఫాక్టరీ నించి సుక్కేసుకుని, మూడుముక్కలాటాడి ముండదగ్గర తొంగొని ఏ అర్ధరాత్రో కొంప చేరే సింహాద్రి- అరోజు సంజవేళ కొంపలో తొంగుంటాడని కల్లోకూడా వూహిం చని రత్తి- సంజె చీకట్లో మంచంమీద మనిషి అప్పే అనుకుని మీద సెయ్యేసింది. అంతే- నిప్పు కాలినట్టు చెయ్యి వెనక్కి లాక్కుంది. అనుకోని అవకాశం దగ్గిర కొచ్చేసరికి సింహాద్రి వంట్లో సెగలుపొగలు రేగాయి- 'రత్తే!-' అంటూ మత్తుగా చెయ్యి పట్టుకున్నాడు.

"నువ్వా-ఛీ- సెయ్యొగ్గు- అప్ప అనుకున్నాను." అంది రత్తి ఛీత్కారంచేసి.

"అగ్గి అప్పే ఎట్టాలేటి- నే నెట్టలేనా ఏటి. యింద అగ్గిపెట్టె." మేలమాడి అగ్గిపెట్టె చేతిలో పెట్టాడు చెయ్యి వదలకుండానే.

"సచ్చినోడా- కొంపలకి అగ్గెట్టమేగా నీపని సెప్పుదెబ్బలు తిన్నా బుద్ధి రాదు." అంది తిరస్కారంగా చెయ్యి గుంజుకుంటూ- సింహాద్రి విలాసంగా నవ్వుతూ "నిన్ను చూస్తుంటే పాడుబుద్ధి నిలవదే నా రత్తాలూ- ఏటలా నిప్పు తొక్కిన కోతిలా తైతక్కలాడిపోతున్నావు- నీ కోసం పడి సస్తుంటే కనికరం లేదే- రెండు నిమిషాలు కల్లు మూసుకోయే సిలకా-" రత్తిని మంచంమీదకు లాగుతూ అన్నాడు. రత్తి అపరకాళి అయింది- "ముందా చెయ్యి మర్యాదగా వగ్గు- నీ వెన్ని సార్లు సచ్చినా నీకీ రత్తి దక్కదు. అనవసరంగా గోల సెయ్యకు. డా వగ్గు- నే

దంటే కేకలెడతాను-" అంది తీవ్రంగా. రత్తి తిరస్కారం సింహాద్రికి మరింత పట్టుదల, పగరేపింది.

"ఎట్టు, కేకెడితే- సంజెవేళ అప్పనేకుండ చూసి గుడిసెలో దూరి మీదడ్డది అని నేనూ సెప్పగలను- పెద్ద నిప్పునాటి పతివత పోజులు మాని రాయె. నిప్పుతో సెలగాటాలడ్డం యీ సింహాద్రికి కొత్తకాదులే- రా- రా- మళ్లీ మీ అప్పవస్తది"- అంటూ బలంగా మంచం మీదకి తోసాడు సింహాద్రి. ఆ తెగింపుకి, ఆ ఆరోపణకి ఒక్క క్షణం దిక్కుతోచని దానిలా వుండిపోయింది. ఆమెవళ్ళు నిప్పులా మండింది. ఆమె వూపిరి సెగలు పొగలు కక్కింది, ఒక్క ఉదుటున బలం కూడకట్టుకుని సింహాద్రిని వొక్క తోపు తోసింది.

"అవునురా, నిప్పునేరా నేను- నిప్పుతో చెలగాటం అడితే బూడిదే మిగులు తుందిరా-" అంటూ ఒక్క ఉరుకున రాటకి కట్టిన కిరసనాయిలు సీసా తీసి సింహాద్రి మీద వంపి, సింహాద్రి ఏం జరిగేది తెల్సుకునే లోపలే అగ్గిపుల్ల గీసి విసిరేసింది— భగ్గున మంట- కెవ్వున కేకవేశాడు సింహాద్రి. "సావు నంజుకొడకా యీ రోజుతో నీ పీడ యిరగడయింది. వరేయ్- యీ అగ్గిపుల్ల నిప్పు రాజెయ్యడానికే కాదురా, నిప్పు ఆర్పుతుంది కూడారా. నా గుండెల్లో నిప్పు చల్లారిందిరా యిన్నాళ్ళకి- వికటంగా నవ్వి గుడిసెనుంచి బయటికి పరిగెత్తింది రత్తి.

('జనసుధ' సౌజన్యంతో)

★

# నబ్బుబిళ్ళ

పెద్దోళ్ళ ఆశలు, కోరికలు ఆకాశాన్నంటే వయినా
ఇట్టే తీరుతాయి-తీర్చుకుంటారు!
చిన్నోళ్ళవి చిరు కోరికలయినా - వాటిని
పరిస్థితులు తారుమారు చేస్తాయి-
దేవుడూ గారడీ చేసేస్తాడు!
ఇదే నబ్బుబిళ్ళ చేసిన గారడి కథ!